విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి : పల్లా

మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 7 : క్రమశిక్షణ, పట్టుదలతో విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శాన్ మారియా హైస్కూల్లో జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ చాటేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు లీడర్ షిప్ క్వాలిటీ పెంచుకోవాలన్నారు. ఉత్తమ పౌరులుగా విద్యార్థులు రాణించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పల్లా పేర్కొన్నారు. అనంతరం వివిధ కాంపిటీషన్స్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యంతోపాటు మాజీ కౌన్సిలర్ ముస్త్యాల దయాకర్, బీఆర్ఎస్ నాయకులు తిప్పారపు విజయ్ కుమార్, సతీశ్ పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 7 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ 127వ జయంతి వేడుకలు శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి (సీఏపీసీఎస్) ఆధ్వర్యంలో రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఏపీసీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్, నాయకులు రాజు, ప్రభాకర్, యాదగిరి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి

లింగాలఘనపురం, ఫిబ్రవరి 7 : ఆర్యవైశ్యసంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆ సంఘం మండల అధ్యక్షుడు దారం అశోక్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దారం అశోక్(కుందారం) గౌరవాధ్యక్షుడిగా కొడితాల సంపత్‌కుమార్(లింగాలఘనపురం), ఉపాధ్యక్షులుగా దారం వెంకన్న(కుందారం), గాదె రమేశ్(కళ్లెం), కోశాధికారిగా కొడితాల శేఖర్‌కుమార్ (లింగాలఘనపురం), ప్రధాన కార్యదర్శిగా గాదె కిరణ్‌కుమార్ (కళ్లెం)ను ఎన్నుకన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌కు పరామర్శ


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 7 : మండలంలోని ఉప్పుగల్లుకు చెందిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ తల్లి వెంకటమ్మ ఇటీవల వృతి చెందిన నేపథ్యంలో శుక్రవారం పలువురు పరామర్శించారు. ఈ మేరకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వేర్వేరుగా ఉప్పుగల్లుకు చేరుకుని ఆరూరి రమేశ్ తల్లి వెంకటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం ఆరూరి రమేశ్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ గౌడ సుదర్శన్‌రెడ్డి, నాయకులు జక్క మల్లయ్య తదితరులున్నారు.

బ్రహ్మోత్సవాల విజయవంతానికి కృషి చేయాలి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 7 : మండలంలోని కొడవటూరులో సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని దేవస్థాన కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి కోరారు. శుక్రవారం ఆలయ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం పాలకవర్గ సభ్యులు, అధికారులు, అర్చకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రికి నాలుగు రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలు, అగ్నిగుండాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకు రావాలన్నారు. భక్తుల కోసం తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో చిందం వంశీ, ప్రధాన పూజారి ఓంనమఃశివాయ, అర్చకులు సదాశివుడు, మహాశివుడు, సంగమేశ్వర్, ఆలయ పాలకమండలి డైరెక్టర్లు నిమ్మ కరుణాకర్‌రెడ్డి, మంతపురి రాములు, బాల భాస్కర్, తిరుపతిరెడ్డి, కీసరి రమేశ్, సత్యనారాయణ, శివరాములు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, భిక్షపతి, రాజయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి
- మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గాడిపల్లి ప్రేమలతారెడ్డి

చిన్నరామన్‌చర్లలో మాట్లాడుతున్న ప్రేమలతారెడ్డి

వడ్లకొండలో నినాదాలు చేస్తున్న నాయకులు

బచ్చన్నపేట/జనగామ రూరల్, ఫిబ్రవరి 7 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ శ్రేణులు ప్రజలకు వివరించి ఎండగట్టాలని జనగామ మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ గాడిపల్లి ప్రేమలతారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తమ్మడపల్లి, చిన్నరామన్‌చర్లలో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో సర్కారు విఫలమైందన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమ లు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టాక ప్రజలను మోసం చేశారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాయయని, దీనిని ప్రజలకు గుర్తు చేయాలన్నారు. అబద్దాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వానికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గ్రామగ్రామాన గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనగామ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, మాజీ కౌన్సిలర్లు వాంకుడోత్ అనిత, ఉల్లెంగుల సందీప్, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, నాయకులు కాంపాని సిద్ధారెడ్డి, ఖలీల్‌ఆజాం, జోగిరెడ్డి, మల్లారెడ్డి, మధు, గుర్రాల నర్సిరెడ్డి, అనిల్‌రెడ్డి, చంద్రయ్య, కరుణాకర్‌రెడ్డి, రాంరెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి జూకంటి శ్రీశైలం అన్నారు. శుక్రవారం మండలంలోని వడ్లకొండ, శామీర్‌పేట గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో సన్నాహాక సమావేశాలు నిర్వహించారు. శ్రీశైలం మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు నీల యాదగిరి, గుర్రం నాగరాజు, యెనగందుల కృష్ణ, గ్రామ అధ్యక్షుడు నామాల భాస్కర్, చాట్ల డానియల్, నాయకులు దండెబోయిన సత్యనారాయణ, కాయితపురం రామ్మోహన్ రెడ్డి, గంగారాం, భాస్కర్, నరేశ్, బొల్లం స్వామి, దండు ఉపేందర్, అరుణ్, బొల్లం ఉదయ్, బిట్ల శంకర్ పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

చిల్పూరు, ఫిబ్రవరి 7 : మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన సామల జగన్నాథం అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో మార్కండేయ పద్మశాలి పరపతి సంఘం బాధ్యులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు గజ్జె దామోదర్, సభ్యులు సుధాకర్, కుమారస్వామి, నాగభూషణం, నారాయణ, వెంకటయ్య, కాంతయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 7 :మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి ఉపాధి హామీ పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను నాణ్యతగా ఉండేలా చేపట్టాలన్నారు. ఈ నెల 15వ తేదీలోపు ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఉపాధి పనులు పూర్తి చేయాలని తెలిపారు. జాబ్ కార్డ్ కలిగి ఉన్న ప్రతిఒక్కరికీ వంద రోజుల పని దినాలతో ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. నిర్దేశించుకున్న పని రోజుల లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయన సూచించారు. నర్సరీల్లో విత్తనాలు నాటి వాటికి అవసరమైన నీటిని అందిస్తూ మొక్కలను పెంచాలన్నారు. రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. బోరు బావులు, కాక్ పిట్స్, మురుగు కాల్వల వంటి ఉపాధి హామీ పనులను గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో వసంత, అడిషనల్ డీఆర్డీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సాగునీటి విడుదలకు అధికారులు చర్యలు తీసుకోవాలి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

నవాబుపేట రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న యశస్వినీరెడ్డి

దేవరుప్పుల/లింగాలఘనపురం, ఫిబ్రవరి 7: యాసంగి పంటలకు దేవాదుల రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి సంబంధిత అధికారులను అదేశించారు. శుక్రవారం లింగాలఘనపురం మండలం నవాబుపేటలోని దేవాదుల రిజర్వాయర్ నుంచి దేవరుప్పుల మండలంలోని సింగరాజుపల్లి, చినమడూరు, పెదమడూరు నీరందించే 4-ఎల్ కెనాలను ఆమె పరిశీలించారు. అనంతరం యశస్వినీరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలోని పాలకుర్తి, దేవరుప్పుల మండలాలకు సాగునీరందించే విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యాసంగిలో వరి ఎండిపోకుండా ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. నవాబుపేట, స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ల నుంచి చెరువులు నింపేందుకు తాను అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాడబోయిన గణేశ్, సోమిరెడ్డి, సజ్జన్, బోనగిరి యాకన్న, లేగ రవీందర్‌రెడ్డి, రాంచందర్‌నాయక్, పులిగిల్ల వెంకన్న, గంగరాజ్, బోనగిరి నర్సింహ పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో నీళ్లే లేవు.. ఎలా తరలిస్తారు..?

నవాబుపేట రిజర్వాయర్‌లో నీళ్లే లేవు.. ఎన్నికల కోడ్ ఉండగా అధికారులు చెరువుల్లోకి ఎలా తరలిస్తారని పలువురు రైతులు వ్యాఖ్యానించారు. దేవరుప్పుల మండలంలోని రైతులతో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి నవాబుపేట రిజర్వాయర్ వద్దకు రాగా పలువురు ప్రశ్నించినట్లు తెలిసింది. రిజర్వాయర్‌లోకి నీళ్లు రావాలంటే.. అశ్వరావుపల్లి ప్రధాన కాల్వ ద్వారా తరలించాలి. అక్కడి రిజర్వాయర్‌లోనే సరిపడా నీళ్లేలేవు. ఇక్కడికెలా తరలిస్తారని రైతులు ప్రశ్నించారు. ఏఈ విద్యాసాగర్‌ను వివరణ కోరగా ఎన్నికల కోడ్ ఉన్నందున తాము వెళ్లలేదన్నారు. నవాబుపేట రిజర్వాయర్‌కు నీళ్లొస్తేనే చెరువుల్లోకి విడుదల చేయగలమన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

దేవరుప్పుల, ఫిబ్రవరి 7: హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాల ని, ఇందుకోసం జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని చినమడూరులోని బీసీ హా స్టల్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వంటగది, నిత్యావసర వస్తువులు, డైనింగ్‌హాల్‌ను పరిశీలించారు. ఆహారం కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత హాస్టల్ వె ల్ఫేర్ అధికారిదేనన్నారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మార్వై రాజు పాల్గొన్నారు.

వంటగదిని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై పోలీసులకు ఫిర్యాదు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 7 : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్‌పై శుక్రవారం జనగామ అర్బన్ ఎస్సై రాజేశ్ కుమార్‌కు రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బీసీ గర్జన సభలో రెడ్డి సామాజికవర్గాన్ని కించపరుస్తూ తీన్మా ర్ మల్లన్న అసభ్యకరంగా వ్యాఖ్యలు చేశాడని తెలిపారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి ఎమ్మెల్సీ పదవి స్వీకరించిన మల్లన్న ఓసీలపై అక్కసును వెళ్లగక్కారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు కత్తుల లక్ష్మి, ప్రభాకర్‌రెడ్డి, శివకుమార్, లింగారెడ్డి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలని ఆందోళన

ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 7 : జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఈడీ కళాశాల ఎదురుగా కొత్తగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డులో ప్లాట్లు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎం, మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్పీ) ఆధ్వర్యంలో బాధితులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూడిద గోపీ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిశోర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సర్వే నంబర్ 326, 328, 329లో 4.30 ఎకరాల ప్రైవేట్ వెంచర్ స్థలంలో (గతంలో చేనేత కార్మికులకు చెందిన స్థలం) 120 గజాల చొప్పున ప్లాట్లు కొనుగోలు చేసి సొంత గూడు కట్టుకుందామనుకున్న సామాన్యులకు అక్కడ బైపాస్ రోడ్డు నిర్మిస్తుండడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసిన భూమాఫియా వల్ల సామాన్యులు ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణంలో ప్లాట్లు కోల్పోతున్న బాధితులకు ప్రభుత్వం గజానికి రూ.15 వేల చొప్పున చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, ఎండీ దస్తగిరి, సుంచు విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాలక మండలి లేదు.. అధికారులు పట్టించుకోరు

మహాశివరాత్రి సమీపిస్తున్నా సమీక్ష సమావేశాలు నిర్వహించని ఎమ్మెల్యే, అధికారులు


పాలకుర్తిలోని సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయం

పాలకుర్తి, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం హరిహరులకు నిలయం. తిరువన్నమలై, అరుణాచలం తర్వాత అంతటి ప్రశస్తి పొందిన ఆలయంలో ఏటా జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా నెల లేదా 20 రోజుల ముందే స్థానిక ఎమ్మెల్యే లేదా కలెక్టర్ జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తారు. కానీ ఈ ఏడాది మహా శివరాత్రి జాతర ఈ నెల 26వ తేదీన ఉంది. జాతర సమీపిస్తున్నా భక్తులకు సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లపై స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, జిల్లా కలెక్టర్ లేదా దేవాదాయ ధర్మధాయ శాఖాధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహించలేదు. దీంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు మహా శివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి సుమారు రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఆలయం చుట్టూ గిరి ప్రదిక్షణ కోసం రోడ్డు పూర్తి చేశారు.ఆలయంపై ఉన్న గర్భగుడి ముందు మహామండపం, రాక్ మెట్లు, చండీ మాత గుడి, శివ పార్వతుల కల్యాణానికి ఆలయం ముందు సీసీ వేశారు. మూడు గదులు, క్యూలైన్, గర్భగుడిలో రాతి కట్టడం, షెడ్స్, సోమనాథుడి స్మారక విగ్రహం, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. పంచగుళ్లను పెద్ద ఎత్తున అభివృద్ధి చేశారు. మహా శివరాత్రి సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట అన్నదాన చేపట్టారు. దాతల సహకారంతో పెద్ద ఎత్తున ఆలయ అభివృద్ధి జరిగింది. కానీ గతేడాది కూడా మహా శివరాత్రి ఏర్పాట్లలో అధికారులు విఫలమయ్యారని స్థానికులు వాపోతున్నారు.

పాలకమండలి ఏర్పాటులో జాప్యం..

జాతర సమీపిస్తున్నా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో పాలక మండలి రాలేదు. ఎన్నికల కోడ్ ముందే ఆలయ కమిటీకి పాలక మండలి నోటిఫికేషన్ విడుదల చేసినా పాలక వర్గాన్ని ఎందుకు ఎంపిక చేయలేదో తెలియదు. అధికార పార్టీలో పోటీ కారణంగానే ఎమ్మెల్యే పాలక మండలిని ఎంపిక చేయలేదని సొంత పార్టీ కార్యకర్తలు, నాయకులే గుసగుసలాడున్నారు. పాలక మండలి లేకపోవడంతోపాటు ఇన్‌చార్జి ఈవోతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆలయానికి పెద్ద ఎత్తున ఆదాయం ఉన్నా ఈవో లేకపోవడంపై విమర్శలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి జాతర సమీక్ష సమావేశం నిర్వహించి జాతర ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

లోన్‌లో తీసుకున్న పాడి గేదె మృత్యువాత

బీమా లేక రూ.లక్ష నష్టపోయిన లబ్ధిదారు

కొడకండ్ల, ఫిబ్రవరి 7 : మహిళా సమాఖ్యలో రుణం తీసుకుని కొనుగోలు చేసిన గేదె మృత్యువాత పడిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. దీంతో బాధిత లబ్ధిదారు ఆందోళన వ్యక్తం చేస్తున్నది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన గాయాల యాదమ్మ ఆరు నెలల క్రితం మహిళా సమాఖ్యలో రూ.2 లక్షల రుణం తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లోని ఉండిలో రెండు గేదెలను కొనుగోలు చేసింది. దీనికితోడు బీమా కోసం ఒక్కో గేదెకు రూ.20 వేల చొప్పున చెల్లించింది. ఈ నేపథ్యంలో గేదెకు ఏదో జబ్బు చేసి శుక్రవారం మరణించింది. దీంతో బాధితురాలు గాయాల యాదమ్మ రోదించింది. రెండు నెలల క్రితం మండలకేంద్రానికి చెందిన బొల్లి లిలిషకు చెందిన గేదె మృతి చెందగా, నేటికీ బీమా అందలేదని యాదమ్మ తెలిపింది. ప్రభుత్వం, అధికారులు పరిశీలించి మృతి చెందిన గేదెకు పరిహారం ఇవ్వాలని కోరింది.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 7 : మండలంలోని తిడుగు ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. శుక్రవారం తిడుగు ఆకేరు వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక లోడ్ తో వెళ్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి, ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నులిపురుగు నివారణకు కృషి చేయాలి

జనగామ రూరల్, ఫిబ్రవరి 7 : మండలంలోని ఓబుల్‌కేశ్వాపూర్‌లోని పీహెచ్‌సీలో మండల వైద్యాధికారి ప్రవీణ్ మాట్లాడారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. బాలబాలికల్లో నులిపురుగు నివారణకు అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సత్యనారాయణ, హాఫీజా భేగం, ఆంజనేయులు, శ్యామల, కీర్తి, ఉజ్వల్, సుమాంజలి పాల్గొన్నారు.

సాగునీటి నిర్వహణలో లోపాలను సరిచేయాలి

కొడకండ్ల, ఫిబ్రవరి 7 : సాగునీటి కాల్వల నిర్వహణలో లోపాలను సరిచేసి పంటలకు నీరందించాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని లక్ష్మక్కపల్లిలోని 4-ఎల్, 7-ఎల్ పంట కాల్వలను, నర్సింగపురం బయ్యన్నవాగు రిజర్వాయర్‌ను రైతులతో కలిసి ఆమె సందర్శించారు. రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందుతున్న విధానాన్ని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.

కంపెనీ ప్రతినిధులు, విద్యార్థులతో మాట్లాడుతున్న విజయ్‌పాల్‌రెడ్డి

లుకాస్ టెక్నాలజీ కంపెనీకి క్రీస్తుజ్యోతి విద్యార్థుల ఎంపిక

జనగామ రూరల్, ఫిబ్రవరి 7 : మండలంలోని యశ్వంతాపూర్‌లోని క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఎల్రక్టికల్ ఫైనల్ ఇయర్‌కు చెందిన 25 మంది విద్యార్థులు లుకాస్ టెక్నాలజీ కంపెనీకి ఎంపికైయ్యారు. దీనికి సంబంధించిన వివరాలను కళాశాల డైరెక్టర్ ఫాదర్ విజయ్‌పాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం లుకాస్ టీవీఎస్-టీవీ కొయిల్ ప్లాంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ వారు విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. టెక్నికల్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, టెలిఫోనిక్ హెచ్‌ఆర్ టెస్టు, డాక్యుమెంట్ వెరిఫికేషన్‌లో 25 మంది అర్హత సాధించారని తెలిపారు. వీరికి ప్రొడక్షన్ ట్రైనీలో వార్షిక ప్యాకేజీ రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు అందిస్తారన్నారు. విద్యార్థులను విజయ్‌పాల్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, లుకాస్ టీవీఎస్ మేనేజర్ అరుణ్, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అధ్యాపకులు అషేర్, నీలిమ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 7 : జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే జనరల్, ఒకేషనల్ విభాగం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయని డీఐఈవో జితేందర్‌రెడ్డి తెలిపారు. ఐదో రోజు శుక్రవారం ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు జనరల్ అండ్ ఒకేషనల్ విభాగం విద్యార్థులు మొత్తం 298 మందికిగాను 276 మంది హాజరుకాగా, 22 మంది గైర్హాజర్ అయినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స్‌కు జనరల్ అండ్ ఒకేషనల్ విభాగం విద్యార్థులు మొత్తం 382 మందికిగాను 363 మంది హాజరుకాగా, 19 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు తెలిపారు. జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలను డీఐఈవో జితేందర్‌రెడ్డితో పాటు డీఈసీ మెంబర్లు పరిశీలించగా, జనగామలో ఉన్న పలు పరీక్ష కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ నిర్వహించారు.

చాగల్లువాసి కందుకూరి వెంకటేశ్వర్లుకు డాక్టరేట్

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 7 : స్టేషన్ ఘన్‌పూర్ మున్సి